بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُهٗ وَنُصَلِّی عَلٰی رَسُوْلِهِ الْكَرِيْمِ وَعَلٰی عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

## Summary of Friday Sermon Huzur-e-Anwar 05.02.2016 (Telugu)

**అహ్మదీయులైన మనపై అధిక బాధ్యతలు పడుచున్నవి. వీటిని మనము గుర్తుంచుకోవలెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఆదర్శముగా తీసుకొని నడుచుటకు ప్రయత్నించిన, దేవుని వాడగుటకు ప్రయత్నించన వ్యక్తే నిజమైన అహ్మదీ. దర్శనము, కుట్రతో దేవున్ని మోసము చేయదలచిన వ్యక్తి అవివేకి, బుద్ధిహీనుడగును.**

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 05.02.2016 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్ - లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాములోని ఒక సభలో ఒక వ్యక్తి తన ఉపన్యాసములో ఇట్లనెను. హజ్రత్ అఖ్దస్ అలైహిస్సలాతు వస్సలాం సంస్థ, ఇతర ముస్లిములలో ఒక్క తేడా మాత్రమే గలదు. అనగా వారు మసీహ్ ఇబ్నె మర్యమ్‌ను సజీవముగా అకాశమున యున్నట్లు నమ్ముతారు, మనము వారు మృతి చెందినారని నమ్ముతాము. ఇది తప్ప మన మధ్య, వారి మధ్య వివాదపూరిత తేడా మరేమియును లేదు. ఈ విషయముతో అనేక విషయములు, వారి అవతరణ ఉద్దేశము కూడ స్పష్టము కానందున వారు స్వయముగా 27 డిసెంబర్ 1905 తేదీన వివరణ కొరకు ఒక ఉపన్యాసము చేసిరి. అందులో వారు తమ అవతరణ ఉద్దేశము కేవలం ఈ తేడాను మాత్రమే కలిగి లేదు, ఇంతటి చిన్న విషయము కొరకు ఈ సంస్థను స్థాపించవలసిన అవసరము దేవునికి లేకుండెనని తెలిపిరి. వాస్తవానికి ముస్లిముల ఆచరణ స్థితి కూడ చెడిపోయి యుండెను. అవి ముస్లిముల వినాశనమునకు కారణమగుచున్నవి. వీరి సంస్కరణ కొరకే అల్లాహ్ తఆలా వారిని పంపెను. వీటిలో ఒకటి అసత్యము నుండి దూరముండుట. సత్యమును స్థాపించుట. సత్య ప్రమాణములను పెంచుకొనుము, ఈ కోణములో మీలో ఇతరులలో తేడాను ఏర్పరచుకొనుమని వారు తమ జమాఅత్‌నకు సూచించిరి. కేవలం విశ్వసించుట, వారి అవతరణను నిజమని నమ్ముట మాత్రమే సరిపోదు. అల్లాహ్ తఆలా కూడ పవిత్ర ఖుర్‌ఆన్‌లో నిజమైన విశ్వాసుల లక్షణము لا یشھدون الزور అనగా వారు అసత్య సాక్ష్యము చెప్పరని తెలిపెను. అన్యారాధన, అబద్ధము నుండి దూరముండుమని కూడ చెప్పెను. అనగా అబద్ధమను పాపము కూడ అన్యారాధన వలెనే గలదు. పవిత్ర ఖుర్‌ఆన్‌లో “జూర్” అను పదము పలుకబడెను. దీని అర్థము అబద్ధము, పొరపాటు పలుకుట, తప్పుడు సాక్ష్యము, దేవునితో మరొకరిని చేర్చుట, అసత్యము పలుకబడే సమావేశములు నిర్వహించుట. పాటలు పాటబడే, తప్పుడు మాటలు మాట్లాడే సమావేశములు నిర్వహించుట. ఇవన్నియు జూర్ కోవకే చెందును. అసత్యము పలుకనివారు, వృధా, అబద్ధము పలుకబడుటకు నిర్వహించబడు సమావేశముల నుండి దూరముండు వారే విశ్వాసులు, దేవుని దాసులు. వారెవరిని అల్లాహ్‌కు భాగస్వాములుగా చేయరు. అన్యారాధనతో కూడిన పనులు జరుగుచున్న ప్రాంతములకు కూడ వారు వెళ్లరు. ఎన్నడు అసత్య సాక్ష్యములు కూడ ఇవ్వరు. మనలోని ప్రతి ఒక్కరు ఈ విధముగా అసత్యము నుండి దూరమున్నచో ఒక పవిత్ర మార్పు సంభవించును. తద్వారా యదార్థమైన విశ్వాసి అగును. ఇప్పుడు నేను అసత్యము గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం చేసిన ఉపన్యాస ఆ భాగమును ప్రవేశపెట్టెదను. దీనిని శ్రద్ధగా వినుము. దీనిని పరిశీలించే అవసరమున్న ఒక పెద్ద సంఖ్య నేడు కూడ మనలోని అనేకులలో గలదు.

ముస్లిముల పరస్పర చీలికకు కారణము ఈ ప్రాపంచికమే అయినది. అల్లాహ్ తఆలా ప్రీతి మాత్రమే దృష్టిలో యున్నచో ఫలానా వర్గ సూత్రములు స్పష్టమైనవి, అని వాటిని స్వీకరించు విషయము సులభముగా అర్థమగును. అల్లాహ్ తఆలా ఇట్లనెను. قل ان کنتم تحبون اللہ فاتبعونی یحببکم اللہ అనగా మీరు అల్లాహ్‌ను ప్రేమించేవారే అయినచో నన్ను అనుసరించుము. తద్వారా అల్లాహ్ కూడ మిమ్ములను మిత్రులుగా చేసుకొనును. వారి అడుగుజాడలలో నడిచి చూడుము. అల్లాహ్ తఆలా ఏ విధముగా మిమ్ములను కరుణించును. అనుచరులు అలానే

నడిచిరి. అనంతరం అల్లాహ్ వారిని ఎక్కడి నుండి ఎక్కడికి చేర్చెనో చూడుము. వారు ప్రపంచమును ఛీ కొట్టిరి. పూర్తిగా ప్రపంచ ప్రేమ నుండి దూరమైరి. తమ కోరికలను చంపుకొనిరి. ఇప్పుడు మీరు తమ స్థితిని వారితో పోల్చి చూడుము. వారి అడుగుజాడలోనే యున్నారా ? ఇప్పుడు దేవుడు వారితో ఏమి కోరుచున్నాడో ప్రజలకు తెలియదు.

హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని (రజి) మిర్జా సుల్తాన్ అహ్మద్ తెలిపిన ఒక సంఘటన తెలిపిరి. అప్పుడు వారు న్యాయమూర్తిగా యుండిరి. వారిట్లు తెలిపిరి. ఒక సారి నా వద్దకు నాకు తెలిసిన ఒక వ్యక్తి వచ్చెను. పేషీ యున్నందున సాక్షులు ప్రవేశపెట్టబడవలసి యుండిరి. నా సాక్షులు హాజరు కాలేదు. కనుక నాకు మరో తేదీ కేటాయించగలరని అతడు నాతో అనెను. హజ్రత్ మిర్జా సుల్తాన్ అహ్మద్ గారు అతనితో హాస్యముగా ఇట్లనిరి. నేను నిన్ను ఎంతో వివేకిగా భావించేవాడిని. కాని నీవు అవివేకిగా తేలినావు. సాక్షులను ఎక్కడి నుండి తీసుకరాగలవు. బయటికి వెళ్లి ఒకరికి 8 ఆనాలు ఇచ్చినచో సాక్షులు వత్తురు. అతడు బయటికి వెళ్లి ఇద్దరు ముగ్గురు వ్యక్తులను సాక్షులుగా తీసుకొని వచ్చెను. హజ్రత్ మిర్జా సుల్తాన్ అహ్మద్ గారు ప్రశ్నించినప్పుడు వారు ఇలా ఇలా సంఘటన జరిగినదని సాక్ష్యమిచ్చుచుండిరి. హజ్రత్ మిర్జా సుల్తాన్ అహ్మద్ గారు ఇట్లనిరి. నేను మనసులోనే నవ్వుచుంటిని. నేను చెప్పినందుకే ఇతడు బయటికి వెళ్లి సాక్షులను తీసుకొని వచ్చెను. అయినను వీరు ఎంత స్పష్టముగా అబద్ధము చెప్పుచున్నారు. దేవుని ప్రమాణముతో, పవిత్ర ఖుర్ఆన్ చేత పట్టుకొని అబద్ధము చెప్పుచున్నారు. అనంతరం నేను వారితో ఇట్లంటిని. మీకు సిగ్గు కలుగడం లేదా ? ఖుర్ఆన్ చేతిలో పట్టుకొని సాక్ష్యమిచ్చుచున్నారు. వీరిని నా ముందటే తీసుకొచ్చినావు. ఇది సాక్షుల పరిస్థితి. నేడు కూడ ఇదే స్థితి గలదు. జమాఅత్‌నకు వ్యతిరేకముగా గల వాజ్యములలో మనకు ఇదే కనిపించును. నేరస్తులు కాకున్నను వాజ్యములో సాక్షులుగా ప్రవేశపెట్టబడుదురు. హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని రజియల్లాహు తఆలా అన్‌హు ఇట్లనిరి. నేడు ప్రపంచ స్థితి చాలా సున్నితమైనది. ఏ కోణములో చూచినా అసత్య సాక్షులను తయారు చేస్తారు. అసత్య వాజ్యము పెద్ద విషయము కాదు బూటకపు పత్రములు సిద్ధము చేస్తారు. అల్లాహ్ తఆలా అసత్యమును అపవిత్రమని పేర్కొని దాని నుండి దూముండమనెను. فاجتنبوا الرجس من الاوثان واجتنبوا قول الزور విగ్రమారాధనతో అసత్యమును కలిపెను. ఒక అవివేకి అల్లాహ్ తఆలాను వీడి ఒక రాయి వైపు తల వంచునో అలాగే సత్యము, సన్మార్గమును వీడి అసత్యమును తన స్వార్థము కొరకు విగ్రహముగా చేసుకొనును. అందుకే అల్లాహ్ తఆలా దీనిని విగ్రహారాధనతో కలిపెను. దానితో పోల్చెను. ఎందుకనగా విగ్రహారాధకుడు విగ్రహముతో మోక్షము ఆశించును. అసత్యమాడు వ్యక్తి కూడ తన వైపు నుండి విగ్రహము సిద్ధము చేయును. విగ్రహము ద్వారా మోక్షము లభించునని భావించును. ఎంత దుర్భర స్థితి. ఎందుకు విగ్రహారాధకులుగుచున్నారు, ఈ అపవిత్రమును వీడుమని అనబడినచో విధి లేదని అందురు. అసత్యమును తన ఆసరాగా చేసుకోవడం కంటే దురదృష్టమేముండును. తుదకు సత్యమే విజయవంతమగునని, మేలు, విజయము అతనిదేనని నేను నమ్మకం కలిగించుచున్నాను.

అనంతరం తన ఒక సంఘటన తెలిపిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇట్లనిరి. నేను ఇస్లాంను బలపరచచు ఆర్యులకు పోటీగా ఒక క్రైస్తవ ముద్రణాలయమునకు రెండు వైపులు తెరిచియున్న ఒక ప్యాకెట్ ముద్రించుటకు పంపితిని. ఆ ప్యాకెట్‌లో ఒక లేఖ కూడ పెట్టితిని. అందులో ఇస్లాంను బలపరచుచు ఇతర మతముల అతస్యమును సూచించు పదములుండెను. వ్యాసము తప్పక ముద్రించాలని వ్రాసితిని. కనుక ఆ క్రైస్తవుడు వ్యతిరేక మతమునకు చెందిన వ్యక్తి అయినందున కోపోద్రేకుడయ్యెను. దైవికముగా అతనికి శత్రుత్వ దాడి చేయుటకు అవకాశము లభించెను. ఎందుకనగా ప్యాకెట్‌లో విడిగా లేఖ పెట్టుట చట్ట రీత్యా నేరము. ఆ విషయము నాకు తెలియదు. ఇటువంటి నేరమునకు శిక్షగా తపాళా చట్టములో ఐదు వందల (500) రూ॥ల జరిమానా లేదా ఆరు నెలల కారాగార శిక్ష గలదు. అతడు తపాళా అధికారులకు సమాచారమందించి నాపై వాజ్యము వేయించెను.

ఈ నేరములో నన్ను గుర్దాస్‌పూర్ పిలవబడెను. ఏ ఏ న్యాయవాదులతో ఈ వాజ్యము విషయములో సలహా తీసుకోబడెనో అందరు అబద్ధమాడడం తప్ప మరో మార్గం లేదని సలహా ఇచ్చిరి. మేము ప్యాకెట్‌లో లేఖ పెట్టనే లేదు, రలియారామ్ స్వయముగా పెట్టినాడు కావచ్చునని చెప్పుము. ఇలా తీర్పు అగును. ఇద్దరు ముగ్గురు అసత్య సాక్షులను ప్రవేశపెట్టడంతో మోక్షము పొందుదురు. (అసత్య సాక్షులను ప్రవేశపెట్టమని న్యాయవాదులు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) నకు సలహా ఇచ్చుచున్నారు.) లేనిచో చాలా కఠినమైన వాజ్యము, మరో మార్గము లేదని న్యాయవాదులనిరి. (కాని హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇట్లనిరి). నేను ఎట్టి పరిస్థితిలో సన్మార్గము,

సత్యమును వీడనని వారందరికి సమాధానమిత్తిని. అప్పుడు అదే రోజు నేను ఆంగ్ల న్యాయస్థానములో ప్రవేశపెట్టబడితిని. నాకు పోటీగా తపాళా అధికారి ప్రభుత్వ అధికారి స్థాయిలో హాజరయ్యెను. అప్పుడు న్యాయవాది తన చేతితో నా వాంగ్మూలమును వ్రాసెను. అన్నిటి కంటే ముందు నన్ను ఇట్లు ప్రశ్నించెను. ఈ లేఖను నీవే ప్యాకెట్‌లో పెట్టినావా? ఈ లేఖ, ప్యాకెట్ నీదేనా ? అప్పుడు నేను వెంటనే ఈ లేఖ నాదే, ఈ ప్యాకెట్ నాదేనని సమాధానమిచ్చినాను. నేను ఈ ఉత్తరమును ప్యాకెట్‌లో పెట్టి పంపినాను. కాని ప్రభుత్వ ఆదాయమునకు నష్టము కలిగించు ఉద్దేశముతో నేనీ పని చేయలేదు. ఆ ప్రభుత్వ అధికారి తమ విషయములన్నిటిని తెలిపి, తన కోపము కక్కిన తరువాత న్యాయమూర్తి తీర్పు వ్రాయుటకు సన్నద్ధమయ్యెను. ఒకటి లేదా ఒకటిన్నర వరుసలు వ్రాసి మీరు వెళ్లి పోవచ్చునని నాతో అనెను. ఇది నేను న్యాయస్థాన గది నుండి బయటికి వచ్చి నా నిజమైన ఉపకారికి కృతజ్ఞతలు తెలిపినాను.

హ్రజత్ మసీహ్ మౌవూద్ (అ) ఇట్లనిరి. అబద్ధము లేనిదే పూట గడవడం కష్టమని నేనెలా అనగలను. ఇటువంటి విషయములు వ్యర్థమైనవి. సత్యము లేనిదే కష్టమని నేనందును. من یتو کل علی اللّٰہ فھو حسبہٗ అల్లాహ్‌ను నమ్మినవానికి అల్లాహ్ సరిపోవును. అసత్యము వంటి హేయమైనది మరొకటి లేదని ఖచ్చితముగా గుర్తుంచుకొనుము. సత్యము పలికిన వారు బంధించబడుతారని ప్రాపంచీకులందురు. నేనెలా దీనిని నమ్మగలను ? నాపై ఏడు వాజ్యములు మోపబడినవి. అల్లాహ్ తఆలా కృపానుసారము ఒక్క దానిలో కూడ ఒక్క అక్షరము అసత్యము వ్రాయవలసిన అవసరము రాలేదు. ఒక్క దానిలో కూడ అల్లాహ్ నన్ను ఓడించినట్లు ఎవరైనా చెప్పగలరా ? అల్లాహ్ తఆలా స్వయముగా సత్యమును బలపరచును. సత్యవంతున్ని శిక్షించే అవకాశమున్నదా ?

మరల వారిట్లనిరి. అసలు విషయమేమనగా సత్యము పలికినందుకు శిక్షపడువారు సత్యము పలికినందుకు కాక ఏదో దాగియున్న దుష్టత్వము, మరో అసత్యమునకు బదులు శిక్ష అనుభవింతురు. అల్లాహ్ తఆలా వద్ద వారి పాపముల, దుష్టత్వముల పట్టిక యుండును. వారి తప్పులు అనేక యుండును. ఏదేని తప్పులో శిక్ష పడును.

సత్యమును పాటించిన వ్యక్తి అవమానమునకు గురి కావడం అసాధ్యమే. ఎందుకనగా అతడు అల్లాహ్ తఆలా రక్షణలో యుండును. అల్లాహ్ తఆలా రక్షణ కంటే గట్టి కోట మరొకటి లేదు. కాని అసంపూర్తి విషయము లాభము చేకూర్చదు. దాహము వేసినప్పుడు ఒక్క చుక్క నీరు త్రాగడంతో దాహం తీరిపోవునని ఎవరైనా చెప్పగలరా? చాలా ఆకలి వేసినప్పుడు ఒక్క బుక్క తినినచో ఆకలి తీరునని ఎవరైనా చెప్పగలరా? అసాధ్యము. పుష్టిగా త్రాగనిదే, పుష్టిగా తిననిదే తృప్తి కలుగదు. ఇదే విధముగా కర్మలలో పరిపూర్ణత కలుగనిదే ఫలములు, ఫలితములు ఏర్పడవు. అసంపూర్ణ కర్మలు అల్లాహ్ తఆలాను సంతృప్తి పరచలేవు. శుభప్రదము కాలేవు. నా ఇష్టము ప్రకారము కర్మలు చేసినప్పుడే నేను శుభము కలిగింతును. వినమ్రత యున్నచో అల్లాహ్ తఆలా ఇసుమంత పుణ్యమును కూడ వృధా చేయడు. అతడు స్వయముగా ఇట్లు చెప్పెను. من یعمل مثقال ذرۃ خیرا یرہٗ (అనగా ఎవరేని అణుమాత్రము సత్కార్యమొనరించినను దానినతడు చూచుకొనును.) ఇట్లనిరి. అణుమాత్రము సత్కార్యము చేసినను అల్లాహ్ తరపున ఫలితము పొందును. ఇప్పుడు ఈ విషయములను గుర్తుంచుకొని ప్రతి అహ్మదీ పరిశీలించుకోవలెను. ఉదా॥ ఇటువంటి కొన్ని విషయములను ప్రస్తావింతును. వాజ్యములలో మనము తప్పుడు వాంగ్మూలము ఇచ్చుచున్నామా అని గమనించవలెను. వ్యాపారములలో లాభము కొరకు తప్పుగా మాట్లాడుచున్నామా అని పరిశీలించుకోవలెను. వివవాహ సంబంధముల సమయమున అసత్యమాడడం లేదు కదా? అన్ని విధాలా స్పష్టమైన సత్యము పలుకుచున్నామా? అమ్మాయి గురించి అన్ని విషయములు తెలుపుచున్నామా? ప్రభుత్వము నుండి సామాజిక, వెల్ఫేర్ సహాయము తీసుకొనుటకు అసత్యమును ఆసారాగా చేసుకుంటున్నారా? ఈ విషయములో అనేక మంది గురించి వ్యితిరేక భావన గలదు. తమ ఆదాయమును గోప్యముగా యుంచి ప్రభుత్వము నుండి సహాయము పొందుచున్నారు. ఇందుకే పన్ను కూడ చెల్లించరు. ఇప్పటి సాధారణ ఆర్థిక స్థితులలో ప్రపంచములోని ప్రతి దేశము సమస్యలను ఎదుర్కొంటున్నది లేదా ఎదుర్కొనెను లేనిచో ఎదుర్కొనును. ఇందుకే ఇప్పుడు ప్రభుత్వములు చాలా లోతుగా పరిశీలన చేయుటకు ప్రయత్నించుచున్నవి. కనుక ప్రభుత్వమునకు ఏదేని తప్పుడు సమస్య తెలిసినచో ఆ వ్యక్తి కొరకు సమస్యలు ఎదురవడమే కాక ఆ వ్యక్తి అహ్మదీ అని తెలిసినచో అహ్మదియ్యత్ కూడ అపనిందకు కారణమగును. ఈ కోణములో ఎవరైనా అసత్యమాడుచున్నచో ప్రాపంచిక లబ్దిని చూడకుము, అల్ప ఆదాయముతో సరిపెట్టుకొని అల్లాహ్ తఆలాను సంతృప్తిపెట్టుటకు ప్రయత్నించుము. తమ నివేదికలలో తప్పుగా వ్రాయడం

లేదని, లేదా ముఖ్యమైన విషయమును వదిలిపెట్టడం లేదు కదా అని పదవిదారులు కూడ ఆత్మ పరిశీలన చేసుకోవలెను. పూర్తిగా స్పష్టముగా చెప్పకపోవడం కూడ అసత్యమేనని ఇంతకు ముందు కూడ నేను ఖుత్బాలో ఒక సారి చెప్పినాను. ధర్మబద్ధతతో పనులను పూర్తి చేయవలెను. కనుక చాలా లోతుగా పనులను చూడవలసిన అవసరమున్నది. ప్రతి ఒక్కరు తమ లాభముల నుండి బయటికి వచ్చి, తమ అహంకారముల నుండి బయటికి వచ్చి, దైవభీతిని దృష్టిలో యుంచుకొని తమ సమస్యలను అధిగమించవలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెలిపినట్లు ఇదంతా లేనిచో, ప్రాపంచిక ఆడంబరమైనప్పుడు ఇది చీలిక వైపు తీసుకెళ్లును. చీలిక వలన జమాఅత్ ఐక్యత కూడ కొనసాగదను విషయము విధితమే. ఇహలోకము వల్లనే ఇతర వర్గములు ఏర్పడినవి. ఇటువంటిదే మరో వర్గము ఏర్పడును. అనగా ఒక్క దుష్టత్వముతో అనేక దుష్టత్వములు జన్మించును. అందుకే అబద్ధము పిల్లలను పుట్టించునని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెలిపిరి. అహ్మదీయులైన మనపై అధిక బాధ్యతలు పడుచున్నవి. వీటిని మనము గుర్తుంచుకోవలెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఆదర్శముగా తీసుకొని నడుచుటకు ప్రయత్నించిన, దేవుని వాడగుటకు ప్రయత్నించన వ్యక్తే నిజమైన అహ్మదీ. ఇదే క్రమంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

అల్లాహ్ కొరకు ఎవరగునో అల్లాహ్ అతని వాడగును. అల్లాహ్ ఎవరితో మోసపోడు. దర్శనము, కుట్రతో దేవున్ని మోసము చేయదలచిన వ్యక్తి అవివేకి, బుద్ధిహీనుడగును. అతడు స్వయముగా మోసపోవుచున్నాడు, ప్రపంచ ప్రేమ, అలంకరణ మొత్తం పాపములకు పునాది. అందుకే అల్లాహ్ తఆలా గౌరవమును సదా హృదయములో స్మరించుచు, ఎల్లప్పుడు అతనితో భయపడవలెను. అతని పట్టు భయంకరముగా యుండును. కాని అతడు కరుణించును, విస్మరించును. కాని ఎవరినైనా పట్టుకొన్నచో భయంకరముగా పట్టుకొనును. ولا يخاف عقبٰها వారి తరువాత వారి స్థితి ఎట్లుండునో అతడు లెక్క చేయడు. అల్లాహ్‌తో భయదువారి, అతని గౌరవమును హృదయములో యుంచుకొను వారిని అల్లాహ్ ఎల్లప్పుడు గౌరవించును. అతడు స్వయముగా వారి కొరకు నిలబడును. హదీసులో ఇట్లు గలదు. من كان لله كان الله له అనగా ఒకరు అల్లాహ్ వారైనచో అల్లాహ్ వారి వారగును. ఇట్లనిరి. ప్రగతి క్రమేణ జరుగును. మేము ముస్లిములము లేదా విశ్వాసులమని అన్నచో, కేవలం మాటలతోనే అల్లాహ్ సంతృప్తిపడడు. అందుకే అతడు ఇట్లనెను. احسب الناس ان يتركوا ان يقولوا أمنا وهم لا يفتنون అనగా మేము విశ్వసించితిమని అన్నందులకు వారు వదిలివేయబడుదురని, పరీక్షించబడరని లోకులు అనుమానించిరా?

ఇస్లాం ఇట్లు బోధించెను. قد افلح من زكٰها తన ఆత్మను పవిత్రము చేసికొనినవారు విజయులైరి. అనగా ప్రతి రకమైన దురాచారము, పాపము, నేరము, వ్యర్థ కోరికలను అల్లాహ్ కొరకు దూరము చేసిన వ్యక్తి. అన్ని రకాల రుచులను వీడి అల్లాహ్ మార్గములో బాధలకు ప్రధాన్యత ఇచ్చిన వ్యక్తి. వాస్తవానికి ఇటువంటి వ్యక్తి మోక్షము పొందినవాడగును. అనగా అల్లాహ్‌కు ప్రాధాన్యతనిచ్చి, ప్రపంచము, దాని అభిరుచులను వీడిన వ్యక్తి.

అల్లాహ్ అనుగ్రహముతో మనలో ఆచరణీయ మార్పులు కలిగించుకొనిన వారమగుదుము గాక! సత్య ప్రమాణమును అర్థము చేసుకొనువారమగుదుము గాక! ధర్మమునకు ప్రపంచముపై ప్రాధాన్యత ఇచ్చువారమగుదుము గాక! ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అడుగుజాడలో నడుచువారమగుదుము గాక! అల్లాహ్ ప్రీతికి ప్రతి విషయముపై ప్రాధాన్యత ఇచ్చి దానిని పొందుటకు ప్రయత్నించువారమగుము గాక! అల్లాహ్ మనకీ అనుగ్రహమివ్వుగాక! (ఆమీన్)

ఖుత్బా జుమా చివరలో హుజూరె అన్వర్ గౌ॥ ఖాసిమ్ తోరె ముబల్లిఘె సిల్సిల మరణ వార్తను తెలిపి, వారి సద్గుణములు, సేవలను ప్రస్తావించి నమాజ్ జనాజ చదివింతునని ప్రకటించిరి. ❀❀❀

BOOK POST (PRINTED MATTER)

To,

.....................................................................

.....................................................................

.....................................................................